# వెలుగూ - వేడీ

నాకు తెలిసిన శకుంతలని పరిచయం చేస్తాను.

సిరిపురం జగన్నాథ పండితులంటే మా సీమలోని నాలుగు జిల్లాల్లోనూ మంచి పేరు. ఆయుర్వేదంలో దిట్ట. అర్చకత్వంలో గురుత్వం వుంది.

ఎప్పుడూ పూజలూ, పునస్కారాలూ, స్నానాలూ, జపాలూ, మందులూ, మాకులూ సాగిపోయే వాతావరణం. అయినా-పిల్లల్ని ప్రయోజకుల్ని చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన లౌకికుడు ఆయన. ఫలితంగా కొడుకులు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

జగన్నాథంగారి ఏడుగురు సంతానంలో ఆరో పిల్ల శకుంతల. ఆమె బియ్యేదాకా చదువుకొచ్చింది. ఏడాది క్రితం రామ్మూర్తితో ఆమె పెళ్ళిని వున్నంతలో ఘనంగానే వెళ్ళబుచ్చారు జగన్నాథంగారు.

కాపురానికొచ్చిన రెండో నెలలోనే భర్త పద్ధతులూ, మెట్టినింటి పరిస్థితులూ అవగతమైనై శకుంతలకి. మూడు బెడ్‌రూమ్‌లున్న ఆధునిక భవంతిలో నివశిస్తున్నా ఆమెకు ఆ యిల్లు ఇరుగ్గానే తయారైంది. ఎప్పుడూ జ్వరం తగిలినట్లే అనిపించసాగింది. అవ్యక్తమైన అశాంతీ, కోపమూ, ఆవేదనా, ఆందోళనా మొలకెత్తి రోజులు గడుస్తున్నకొద్దీ అవన్నీ మొక్కలై, చెట్లుగా పెరగసాగినై.

"నాన్న ఎప్పుడూ ఇంతే. 'ఇప్పుడే పెళ్ళికి తొందరేఁవిటి' అంటే విన్లేదు" అని చాలాసార్లు అనుకునేది శకుంతల. వాస్తవం, తన పాత కలల్ని పక్కకి నెట్టాలని చూస్తున్నప్పుడల్లా సంఘర్షణకి లోనయ్యేది.

శకుంతల కథలో ఇప్పుడు జరుగుతున్నది చెప్తాను.

"ఇవతల ముఖ్యమైన విషయాలు మాట్లాడుతుంటే, వీపాలినుకోవే అని బెల్లంకొట్టిన రాయిలా కూచోడం వాళ్ళ పొగరుకి నిదర్శనం." పెళ్ళాం ఉదాసీనతకి ఉగ్రుడై పోయాడు రామ్మూర్తి.

ఠక్కున మొహం పక్కకు తిప్పి సూటిగా భర్త కళ్ళల్లోకి చూసింది శకుంతల. ఆ చూపుల్లో వేడి రామ్మూర్తికి చురుక్కున తగిలింది. "నేను మాట్లాడాల్సిందేఁవీ లేదు!" అంటూ లేచి తన గదిలోకి నడిచింది.

భార్య సమాధానానికి దమ్మిడీ అంత మొహం చేసుకుని నిలబడిపోయాడు రామ్మూర్తి. ఏం చేయాలో పాలుపోలేదు. కాలూ చెయ్యీ ఆడలేదు. సోఫాలో కూలబడి గోళ్ళు కొరుక్కుంటూ వుండిపోయాడు. నళ్ళీ అలానే వుండిపోలేక "తలబిరుసుతనం...." అని పళ్ళు కొరికేడు. కాళ్ళు నేలకి తాటించేడు.

"వర్తి పెంకిఘటం...." అని మెటికలు విరిచింది శాంతమ్మ. ఆమె రామ్మూర్తి తల్లి.

"ఆలు కాదు నా తల ప్రాలు...." తనలో తను గొణుక్కుని నుదుట అరచేత్తో కొట్టుకున్నాడు.

ఆ తర్వాత కొంతసేపు తల్లీ కొడుకూ మంతనాలాడుకున్నారు. పక్క గదిలో పడుకున్న శకుంతలకి వాళ్ళిద్దరి మంతనాల్లోని నిర్ణయం అర్థమౌతూనే వుంది. తన చెల్లెలు వాసంతి పేరున విజయవాడలో పదిసెంట్ల ఇళ్ళస్థలం కొంటున్నాడు రామ్మూర్తి.

శకుంతలని రోషం, ఉక్రోషం ఉక్కిరిబిక్కిరి చేసినై. గుండెల్లో పిడుగులు పడి, మనసులోని అసహాయత కళ్ళల్లో వర్షం కురిపించింది.

ఒక గంట తర్వాత—

లేచి మొహం కడుక్కొని వచ్చి అద్దం ముందు నిలబడింది శకుంతల. కళ్ళల్లో కాంతీ మొహంలో

తారుణ్యమూ, శరీరంలో లావణ్యమూ వెలిసిపోతున్నట్లు అనిపించింది. 'గోరంతల్ని కొండంతలు చేసుకుని బాధపడు తున్నానా' అని తనలో తాను ప్రశ్నించుకుంది. 'లేదు.... లేదు....లేదు....' అని మనస్సాక్షి సమాధానం చెప్పింది. మొహాన్న తిలకం దిద్దుకుని, బుక్ షెల్ఫ్ కేసి నడిచింది. అప్రయత్నంగా ఆమె చేతులు 'తనలో తాను' మీదికి వెళ్ళినై. మనస్సుని ప్రశాంత పరచడానికి ఆమె పదేపదే చదివే పుస్తకం అది.

సాయంత్రం ఆరు గంటలవుతుండగా పుస్తకం మూసివేసింది శకుంతల. వంటింట్లోకి నడిచింది. రామ్మూర్తి లేడు. బయటికి వెళ్ళినట్లున్నాడు వంటావిడ రుక్మిణమ్మ 'టీ ఇవ్వనా' అంటూ ఎదురొచ్చింది. 'నే చేసుకుంటాను' అని తానే టీ కలుపుకుని అక్కడే ఒక స్టూలు మీద కూర్చుని తాగింది. కప్పు సింక్‌లో కడిగి పక్కగా పెడుతూ వంట గదిని వోసారి కలయజూసింది. వో పక్కన హాట్ ప్లేట్, వొక పక్కన గ్యాస్‌స్టవ్; ఒక అల్మైరాలో పాతిక మంది భోజనానికి సరిపడే క్రోకరీ; వెనగ్గా గోడకున్న అరల్లో స్టీలు డబ్బాలూ గిన్నెలూ, పళ్ళేలూ; వో అరలో మిక్సీ; వో నాలుగు సైజుల్లో ప్రెషర్ కుక్కర్లు, ఆ పక్కగా ఒక్క మిల్క్ బాయిలర్, కాఫీ ఎస్ప్రెస్సో; గట్టు చివర వాటర్ ఫిల్టర్.

సన్నగా నవ్వుకుంటూ బయటికొచ్చింది. హాల్లోనుంచీ నడుస్తుంటే నేలమీద పరచుకున్న తివాచీ సొగసుగా పాదాల్ని ముద్దెట్టుకుంటోంది.

తన ప్రయత్నం లేకుండానే ఆగిపోయింది శకుంతల. చుట్టూ వున్న ఫర్నిచర్‌ని వివరంగా చూడసాగింది. అటూ ఇటూ సోఫాలు, మధ్య టీపాయ్; గోడలకు అనేక రకాల పటాలున్నై. వాటి మధ్యలో అక్కడక్కడా ఫోటోలు. రామ్మూర్తి ఏవేవో కాన్ఫరెన్స్‌ల్లో ఎవరెవరో వి.ఐ.పీలతో కలిపి తీయించుకున్నవి — అవి. దేశంలోని ఫోటోగ్రాఫర్లంతరూ, కక్షగట్టి "నిన్నిలాగే జనానికి చూపిస్తాం" అని ఒట్టేసుకుని తీసినట్టు—వాటన్నిటిలోనూ రామ్మూర్తి మొహం సాధ్యమైనంత అసహ్యంగా వుంది. మొహం తిప్పుకుంది శకుంతల.

అప్రయత్నంగా ఆమె చూపులు వో ప్రక్కగా వున్న ఇంపోర్టెడ్ స్టీరియో మీద పడినై. అందులోనే రేడియో కూడా వుంది. దానిముందు సోఫాలో కూర్చుని ఏదో సంగీతం వింటూ తల ఆడిస్తోంది శాంతమ్మ, శకుంతల రాకని గమనించి మొహం పక్కకి తిప్పుకుంది ఆవిడ.

ఆమె ముఖ కవళికల్ని గమనించి ముందుకు సాగింది శకుంతల.

హాలు దాటితే వసారా. వసారాంలోంచీ కిందికి మెట్లు క్రింది భాగంలో ఇంటివాళ్ళున్నారు. ఇంటిముందు

పోర్టికో. పోర్టికో బయట లాన్, గార్డెన్. బయటికి వచ్చేసింది శకుంతల. లాన్‌లో కూర్చుంది.

' పశ్చిమంలో సూర్యుడు ఉరి పోసుకుంటున్నాడు. ఆశయ సాధనలో వైఫల్యానికి ప్రాయశ్చిత్తంగానా ? ఏమో ? అయినా అలా ఎందుకనుకోవాలి? తన కర్తవ్యం నిర్వహించిన తృప్తితో విశ్రాంతి తీసుకోబోతున్నాడేమో? '

శకుంతల ఏకాంతాన్ని భంగం చేస్తూ ఇంటి వాళ్ళమ్మాయి ఇందిర వచ్చింది. శకుంతలకు ఎదురుగా కూర్చుని మాట కలిపింది. ఇద్దరూ పిచ్చాపాటీలో పడ్డారు.

మాటల మధ్యలో అడిగింది. ఇందిర, " అక్కా— ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న దానిలా వుంటా వెందుకు? "

శకుంతల వూహించని ప్రశ్నయిది. అయినా నిభాయించుకుని సమాధానం చెప్పింది. ' నాకు పెళ్ళయిందిగా ' అని.

ఇందిరకు అర్థం కాలేదు. అయోమయంగా శకుంతల కేసి చూసింది. సన్నగా నవ్వింది శకుంతల.

" అయితే నే పెళ్ళి చేసుకోను " ఠక్కున అని, చీర కొంగు మెలిపెట్టూ బుంగమూతి పెట్టింది ఇందిర.

శకుంతల గతుక్కుమంది. తికమకపడింది కూడా. మెదడులో ఏవేవో ఆలోచనలు ప్రవహించ సాగిసై. రైలు

పెట్టెలో కిటికీ పక్కగా కూర్చుని బయటికి చూస్తున్నట్లని పించసాగింది శకుంతలకి.

ఆ తర్వాత—అక్కడ నిశ్శబ్దం ముద్దకట్టింది. కొద్ది క్షణాల తర్వాత ఇందిర లోపలికి వెళ్ళిపోయింది.

ఏడు గంటలు దాటుతుండగా వచ్చాడు రామ్మూర్తి. అతని వెనకాలే బండివాళ్ళు ఒక పెద్ద అట్టపెట్టిని తీసుకొచ్చి వంట గది తలుపు ప్రక్కగా హాల్లో వుంచి ఊడదీయసాగారు. ఫ్రిజ్ అది.

శాంతమ్మ మొహం చాటంత అయింది. సంతృప్తి నిండిన కళ్ళతో కొడుకుని వివరాలు అడుగుతూ అతనికేసి గర్వంగా చూస్తూ కూర్చుంది.

బండివాళ్ళని పంపేసి, డ్రెస్ ఛేంజ్ చేసుకొచ్చి సోఫాలో కూర్చున్నాడు రామ్మూర్తి. కాఫీ తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది శకుంతల.

'ఎలా వుంది? ' కాఫీ సిప్‌చేస్తూ భార్యను అడిగేడు రామ్మూర్తి.

"రాత్రి చెప్పానుగా" అంటూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది శకుంతల.

రామ్మూర్తికి పాలమారింది. కళ్ళు చెమ్మగిల్లినై. అరచేత్తో కొడుకు మాడు మీద చరుస్తూ ఏదో హెచ్చరిక చేసింది శాంతమ్మ.

భార్య సమాధానం నుంచీ చాలా సేపటి దాకా కోలుకో లేకపోయాడు రామ్మూర్తి.

ఫ్రిజ్‌ని పూర్తిగా సర్దుతూండగా భార్యని పిల్చాడు రామ్మూర్తి. ఆమె రాలేదు. రుక్మిణమ్మ వచ్చి శకుంతల స్నానం చేస్తున్నదని చెప్పింది. తల్లీ కొడుకులు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

శాంతమ్మ ఫ్రిజ్‌ని అక్కడ ఇక్కడా స్పృశించీ, తెరిచీ, మూసీ పట్టుకునీ మురిసిపోయింది. కొడుకు ప్రయోజకుడైనాడనే ఆనందంతో తనలో తాను చాలాసార్లు ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

" నే చెప్తినే....వాడి కసలు సంతృప్తిగా లేదమ్మా. " ఇంతేనా సార్. ఇంకోటేదైనా ఆలోచించండి " అని మధ్యాహ్నం దాకా వొకటేరొద. ఈసారి చూడాలి. " రామ్మూర్తి చెప్తున్నాడు.

భోజనాలయినై. కొడుకు తెచ్చిన వస్తువుతోనే కడుపునిండగా సంతృప్తిపడిన శాంతమ్మ తొందరగానే నిద్రపోయింది.

నెమ్మదిగా కదిలి శకుంతల గదిలో కొచ్చాడు రామ్మూర్తి, " నీ పద్ధతేం బావులేదు " అంటూ మంచం మీద కూర్చున్నాడు.

" అవును " అని చీరెకుచ్చెళ్ళు సరిచేసుకుని కుర్చీలో కూర్చుంది శకుంతల.

" అంటే ?- " రెట్టిస్తూ విషయాన్ని సాగదీయడం మొదలెట్టాడు రామ్మూర్తి.

" చెప్పాను కదా—మీ పద్ధతేఁవీ బాపులేదు "

" అది నేననే మాట "

" నా మాటా అదే "

పరాభవాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు రామ్మూర్తి, " అంటే నీ సత్యాగ్రహం.... "

" అవును, సాగుతుంది. దాన్ని మాన్పించడానికి మీరేంచేస్తున్నారు కనుక. పైగా అగ్నికి ఆజ్యాన్ని తోడు చేస్తున్నారు. "

" సరే అయితే...." లేచి గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు రామ్మూర్తి.

శకుంతలకి బాధా, ఆవేదనా కలిగినై. ఆ తర్వాత కొద్ది సేపటికి మనస్సుని చిక్కబట్టుకుని టేబుల్‌లోని కవర్‌నీ, కవరులోని కాగితాల్నీ చేతుల్లోకి తీసుకుంది. అందులో ఆమె చదువుకు సంబంధించిన సర్టిఫికెట్స్ వున్నాయి.

— ఇది జరిగిన పది పదిహేను రోజుల్లోనే ఆ వూరికి టీ.వీ. రిలేస్టేషన్ వచ్చింది.

ఆ రోజు నుంచే కార్యక్రమాలు ప్రారంభం.

సాయంత్రం నాలుగవుతుండగా ఆటోలో టీ.వి. తెచ్చాడు రామ్మూర్తి. మరో అర్థ గంటలో యాంటినా ఫిక్స్ చేయించడం పూర్తయింది. శాంతమ్మ సంబరం మాటల్లో చెప్పలేనిది.

కార్యక్రమాల ప్రసారం మొదలైంది. 'ఎంత ఇష్టం లేకపోయినా, ప్రోగ్రామ్‌ని చూడొచ్చు.' భార్యనుద్దేశించి యథాలాపంగా అన్నాడు రామ్మూర్తి.

ఆమె హాల్లో వో మూల కుర్చీలో కూర్చొని పత్రిక చదువు కుంటోంది.

"సయించని పాయసాన్ని అరగించే అవస్థ నాకక్కర్లేదు." అని అక్కణ్ణుంచీ కదిలింది శకుంతల.

రామ్మూర్తి మొహం పాలిపోయింది. ముూతి పదహారు వంకర్లు తిప్పి 'రణపెంకి' అన్నది శాంతమ్మ.

రాత్రి—ఒంటి గంట అయింది.

ఉలిక్కిపడి లేచింది శకుంతల. "పాడుపీడకల" అనుకుని మళ్ళీకళ్ళు మూసుకోబోతూ పక్కమంచం కేసి చూసింది. రామ్మూర్తి లేడు.

మంచం దిగి నెమ్మదిగా గది బయటికి వచ్చింది. హాల్లో రుక్మిణమ్మ మంచి నిద్రలో వుంది. ముందుకు నడిచింది. శాంతమ్మ గదీ ఖాళీగా వుంది. శకుంతల అడుగులు సాగినై. వంట గది పక్కగా వున్న సామాను గదిలో సవ్వడి వినపడింది. ఆగి వూపిరి బిగబట్టి తలుపు పక్కగా నిలబడింది. తలుపుకున్న సన్న సందులోంచీ సన్నగా వెలుగు ప్రసరిస్తోంది. జాగ్రత్తగా ఆ ఖాళీలోంచీ ఒంటి కంటితో లోపలికి చూసింది. రామ్మూర్తి, శాంతమ్మ ఎదురెదురుగా కూర్చుని వున్నారు. వాళ్ళముందు (ఒక) బట్టమీద కొంతబంగారం, నగలు, కొంతనగదు వున్నై.

శకుంతలకి పెదవులు పొడారిపోయినై. తెలియకుండానే శరీరం వణికింది. వెన్ను జలదరించింది.

సన్నగా మాటలు వినపడసాగినై.'ఇల్లుకట్టుకుందాంరా అబ్బాయ్' "ఇప్పుడు కాదులేవే, కొన్నాళ్ళుపోనీ. ఈ బంగారాన్ని వాసంతి దగ్గర పెట్టిరా"

ఆపైన వినదల్చుకోలేదు శకుంతల. నెమ్మదిగా కదిలి తన గదిలోకి వచ్చేసింది. తెగని ఆలోచనల్లోనే తెల్లవారింది.

ఉదయం తొమ్మిది గంటలవుతుండగా టెలిగ్రాం వచ్చింది. జగన్నాథంగారు పోయారు!

రాత్రి పీడకలకి కారణం తెలిసింది శకుంతలకి. వెంటనే ప్రయాణమై పుట్టింటికి బయల్దేరింది. రామ్మూర్తి అనుసరించేడు.

' పెద్దల చావు పెళ్ళితో సమానం ' అన్నట్లుగా — (చాలా) ఘారీగా జరిగినై — జగన్నాథంగారి దినవారాలు.

నలుగురు కూతుళ్ళూ, అల్లుళ్ళూ, ఇద్దరు కొడుకులూ కోడళ్ళూ దగ్గరుండి అన్నీ జరిపించారు. చివరివాడు సత్యం.

రెండు రోజులు గడిచేక రామ్మూర్తి బయల్దేరేడు. వీధి గేటు దాకా వచ్చిన శకుంతల కళ్ళల్లోకి ప్రాధేయ పూర్వకంగా చూస్తూ " నువ్ తిరిగి రావడం నా 'శకూ'గా వస్తావని ఆశిస్తున్నాను. '' అన్నాడు.

శకుంతల ఏం మాట్లాడలేదు.

కొద్ది క్షణాలు గడిచాయి. రామ్మూర్తి అడుగు పక్కకి వేస్తుంటే అప్పుడు అన్నది శకుంతల — 'మీరూ నా వారు కావచ్చుగా' అని.

అసహనంగా కదిలేడు రామ్మూర్తి. మెడమీద మిడిత పడ్డట్లనిపించిందతనికి.

ఆ వేళ ఏవో పిచ్చాపాటీ కబుర్లాడుతూ. ' ఏఁవే శకూ....మీ ఆయన దోసిళ్ళతో సంపాయిస్తున్నాట్టగా,

నువ్విట్టా దీపపు సెమ్మెలా వచ్చావేం ? ' అని అడిగింది శకుంతల మూడో అక్కయ్య.

" ఏం — మీ ఆయనకి ఈర్ష్యగా వుందా ? " అని ఎదురు ప్రశ్న వేసింది శకుంతల. అతనూ, రామ్మూర్తి ఒకే ప్రభుత్వ శాఖలో పన్జేస్తున్నారు. కాకుంటే, రామ్మూర్తి మధ్య తరగతి ఆఫీసరు, శకుంతల బావ కింది తరగతి గుమాస్తా.

" ఏఁవిటే ఆ పెడసరపు సమాధానం '' అని మొహం చిన్నబుచ్చుకుని 'ఎరక్కబోయి అడిగేను' అని అక్కణ్ణుంచీ వెళ్ళిపోయింది.

శకుంతల చిన్నన్న ఆమె దగ్గరకొచ్చి, 'రామ్మూర్తికి మంచి పలుకుబడి వుందని తెలిసింది. మీ మేనల్లుణ్ణి ఏదైనా ఉద్యోగంలో పడేస్తాడేమో చెప్పవే ' అని అడిగేడు.

" వాసుని ఇక్కడే వుంచి వెళ్ళు. మన సత్యం తోపాటు వుంటాడు. ఉద్యోగాల సంగతి తర్వాత చూద్దాం" అంది శకుంతల.

సత్యం డిగ్రీ థర్డియర్‌లో వున్నాడు. వాసుది కూడా అదే వయస్సు. ఏమనుకున్నాడో ఏమో — వెళ్తూ వెళ్తూ కొడుకునీ తీసుకునే వెళ్ళాడాయన.

అంతరూ ఎవరిదారిన వారు వెళ్ళారు. ఖాళీ స్టేషన్‌లా మిగిలింది ఇల్లు.

నెల రోజులు యాంత్రికంగా గడిచిపోయినై. ఒక రోజు మధ్యాహ్నం—తను ఆశిస్తున్న ఉత్తరాన్ని అందుకుంది శకుంతల.

ఆ రాత్రంతా—ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చింది. శకుంతల. మర్నాడు, రామ్మూర్తికి ఉత్తరం రాసి పోస్ట్ చేసేసింది.

శకుంతల జాబు చూసిన రామ్మూర్తికి కళ్ళనీళ్ళ తక్కువ. గుండె బిగబట్టి, నాలిక పిడచకట్టి, పెదవులు ఎండిపోయినై. కింకర్తవ్యతా మూఢత్వం ఆవరించి అమావాస్యలా అయిపోయాడు. ఆలోచనలు పిరికివి గావడం వలన అయోమయాన్ని సృష్టించేయి.

శాంతమ్మ—సరేసరి; ఏడేడుతరాల్నీ శాపనార్ధాలు పెడ్తూ, తిట్ల దండకాలు వల్లిస్తూ చిందులు తొక్కింది.

రామ్మూర్తి వస్తుతః చెడ్డవాడు కాదు. అనుకోకుండా వచ్చిన అవకాశాల వల్ల వ్యామోహాల వలలో చిక్కుకుపోయాడు. అతని స్వభావం శకుంతల అవగతం చేసుకున్నది గనుకనే, అతను మారతాడన్న నమ్మకం ఉండటం వల్లనే ఆమె తన ప్రయత్నం మొదలు పెట్టింది. అది ఫలించింది.

వారం తిరిగే సరికి శకుంతల ముందు వాలేడు రామ్మూర్తి. భార్య గదిలో శాంతి వాతావరణం — చల్లగా, కమ్మ తెమ్మెరలా వుంది.

"కూర్చోండి." — శకుంతల గొంతులో నిబ్బరం, నిశ్చలత్వం—సముద్ర మంత గంభీరంగా వుంది.

రేడియోలో ఎవరో గాయని తన గాన మాధుర్యాన్ని మంద్రస్వరంలో చెరకు రసంలా స్రవింపజేస్తోంది.

పరామర్శలయ్యాక, గొంతు పెగుల్చుకుని సంజాయిషీ యిచ్చుకుంటున్నట్టు మొదలెట్టేడు రామ్మూర్తి.

'నా పరిస్థితి అర్థం చేసుకో శకూ. నేనుగా కావాలని ఎవర్నీ అడగను. మాడిపార్టుమెంటు అలవాట్లూ ఆచారాలూ అలా వచ్చినై. నేను మడిగట్టు క్కూర్చున్నా బతకనివ్వరు.' అని "ఓహ్ — పిచ్చి పుడుతోంది. చెప్పొకోవాలంటే, నిజానికి నెల తిరిగే సరికీ వచ్చే ఆ ఆదాయాన్ని ఏం చేయాలో తెలీక మతి పోతోంది" ఆగేడు.

శకుంతల భర్త కళ్ళల్లోకి తీక్షణంగా చూసింది.

రామ్మూర్తి తలవంచుకున్నాడు. క్షణాల తర్వాత 'చిలికి చిలికి గాలివానలా చెయ్యకు. ప్లీజ్' సన్నగా అన్నాడు.

"నాకెలాంటి దురాలోచనలూ లేవు. పైగా నా కాపురం నాకూ తియ్యనైనదే. నా సంసారాన్ని స్వర్గంలా చేసుకోవాలన్నదే నా కోరిక కూడా. మీకు రాశాను కదా. నేనిప్పుడు బాధ్యత కలిగిన ఉద్యోగినిని. ఏం చేయ్యాలో

నిర్ణయించుకోవలసింది మీరే. నా దృక్పథమే సరియైనదని నేను వాదించటం లేదు. కానీ, అది మన మనస్సులకి నీడనూ, చల్లదనాన్నీ ఇస్తుందనే నమ్మకం నాకున్నది. ఇక మీ ఇష్టం. ”

అతని మనసంతా అలజడికి లోనైంది. బలమూ బలహీనతల మధ్య ఊగులాటలో పడ్డాడు.

సాలోచనగా ఆమెవంక చూశాడు రామ్మూర్తి. తన కన్నా ఓ మెట్టు పై నున్నట్లుగా కనిపించింది శకుంతల. ఆమెని చూస్తూన్న కొద్దీ–'స్వామిముందు వేసిన సాంబ్రాణీ ధూపంలా' తోచిందతనికి.

♦ ♦ ♦

ఇదీ జరిగింది.

రామ్మూర్తి ఆ తర్వాత ఏం చేశాడనేది నిఖరంగా చెప్పాలనుకోవడంలేదు నేను.

శకుంతల ఆదర్శానికి జోహారుగానే ఆమె కథ చెప్పాన్నేను. ఆదర్శాన్ని కలిగివుండటం వేరు. ఆ ఆదర్శాన్ని ఆచరించాలంటే కావలసిన మానసికమైన సత్తువని సంపాయించుకోవడం వేరు.

శకుంతలలోని ఈ గుణం ఆమెని ఈ కథకే కాదు ; రాచపుండుతో బాధపడుతున్న ఈ వ్యవస్థకే నాయకురాల్ని చేసింది.

శక్తివంతమైన దీపపు వెలుగు ; సముద్ర మధ్యంలో అంధకారంలో కొట్టుమిట్టాడే వ్యక్తికి—మార్గదర్శిని కాక ఏమౌతుంది.

ఆ వెలుగు—శకుంతల !

మరి ఆ వ్యక్తి—రామ్మూర్తే ! !